- కరెంటు ఉన్నప్పుడు..



- కరెంటు కట్ అయ్యాక అవస్థలు..



- చీకట్లోనే వైద్య సేవలు



# 'ఎంసీహెచ్'లో పవర్ కట్

**3 గంటలు నిలిచిన సరఫరా**

మంచిర్యాల అర్బన్, జూలై 4 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)లో బుధవారం రాత్రి మూడు గంటల పాటు కరెంట్ పోవడంతో బాలింతలు, గర్భిణులు, శిశువులు, బంధువులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎంసీహెచ్‌లో బుధవారం ఉదయం 10 గంటల నుంచే కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దవాఖాన ఎలక్ట్రిసిటీ ఇంజినీర్ రమేశ్ పరిశీలించగా, సమస్య ఎక్కడ ఉందో అర్థం కాలేదు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో విద్యుత్‌శాఖ సిబ్బంది వచ్చి అండర్ గ్రౌండ్ లైన్‌లో కేబుల్ సమస్య ఉన్నట్లు గుర్తించగా రాత్రి 10 గంటల దాకా జనరేటర్ సాయంతో విద్యుత్ సరఫరా చేశారు. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో జనరేటర్‌ను ఆఫ్ చేసి మరమ్మతులు ప్రారంభించారు. హాస్పిటల్ ఎలక్ట్రిషియన్ విజయ్ ఆచార్య మరమ్మతులు పూర్తి చేయగా, అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఐసీయూ, జనరల్ వార్డుల్లో చికిత్స పొందుతున్న బాలింతలు, గర్భిణులు, ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న 22 మంది శిశువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ సమయంతో దవాఖాన సిబ్బంది దురుసుగా ప్రవర్తించినట్లు రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై హాస్పిటల్ సూపరింటెండెంట్ హరీశ్ చంద్రారెడ్డిని వివరణ కోరగా, కేబుల్ సమస్య తలెత్తి విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందని, త్వరలో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని వివరించారు.



# బాలుడిని బతికించరూ..!

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న శ్రేయాన్
- ఇంజెక్షన్ ఖరీదు రూ. 16 కోట్లు
- ఆదుకోవాలన్న తల్లిదండ్రులు

కోటపల్లి, జూలై 4 : రెక్కాడితేగాని.. డొక్కాడని కుటుంబంలో పుట్టిన ఆ బాలుడికి అరుదైన వ్యాధి సోకింది. రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ ఇస్తే బతికించవచ్చని వైద్యులు తెలుపగా, అతడి తల్లిదండ్రులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం వెంచపల్లికి చెందిన పడాల రవళి-సతీశ్ దంపతల కుమారుడు శ్రేయాన్‌కు ఏడాది వయసొచ్చినా కాళ్లు కదపకపోవడం.. బోర్లా పడకపోవడంతో అనుమానం వచ్చి హైదరాబాద్‌లోని రెయిన్‌బో హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైదులు బాబుకు పరీక్షలు నిర్వహించి, స్పైనల్ మస్క్యులర్ అట్రాఫీ టైప్-2 అనే వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ వ్యాధి నయం కావాలంటే రెండేళ్లు వచ్చేలోగా జోల్జెన్‌స్మా అనే ఇంజెక్షన్‌ను విదేశాల నుంచి తెప్పించాలని, దీని ఖరీదు రూ.16 కోట్ల దాకా ఉంటుందని వైద్యులు తెలిపారు. ఇప్పటికే వైద్యం కోసం రూ.10 లక్షల దాకా ఖర్చు చేశామని, ప్రస్తుతం వైద్యం కోసం నెలకు రూ.10 వేల నుంచి రూ. 20 వేల దాకా ఖర్చు చేస్తున్నామని, సర్కారుగాని.. దాతలుగాని ఆదుకోవాలని ఆ బాలుడి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఫోన్‌పే నంబర్ 8919512601కు డబ్బులు పంపి సాయమందించాలని చేతులెత్తి మొక్కుతున్నారు.

# మా జనరేషన్ లీడర్ మీరు!

- విజన్ ఉన్న పొలిటీషియన్ మీరు
- తెలంగాణ సాధించి పెట్టారు
- ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కేటీఆర్‌ను కలిసిన హైదరాబాద్ యువతి
- అప్పటికప్పుడే కేటీఆర్ వ్యక్తిత్వాన్ని మెచ్చుకుంటూ న్యాప్కిన్‌పై లేఖ



హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): దేశ రాజధాని ఢిల్లీ ఎయిర్‌పోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు అరుదైన ఘటన ఎదురైంది. గురువారం సాయంత్రం విమానాశ్రయంలో దిగిన కేటీఆర్ దగ్గరకు హైదరాబాద్‌కు చెందిన వినీల పరుగున వచ్చింది. కేటీఆర్‌తో ఒక ఫొటో దిగింది. అప్పటికప్పుడు తన దగ్గర ఉన్న న్యాప్కిన్‌పై కేటీఆర్ నాయకత్వ లక్షణాలు ప్రశంసిస్తూ లేఖ రాసి ఆయనకు అందించారు. 'మీరు ఎంత ఆదర్శంగా ఉంటారో మీతో కొద్దిసేపు మాట్లాడితే తెలుస్తుంది. మీరు ఆధునిక, ఉన్నత వ్యక్తిత్వ భావాలు కలిగినవారు. మిమ్మల్ని ఎప్పటినుంచో గమనిస్తున్నాం. వినయపూర్వకంగా, హంబుల్‌గా, సింపుల్‌గా ఉంటారు. మీలాంటి వ్యక్తి ప్రధానమంత్రి కావాలని చాలాసార్లు అనుకున్నా. మీరు విజనరీ పొలిటీషియన్. మీ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో అనేక ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించారు. విదేశీ సంస్థలను హైదరాబాద్‌కు రప్పించారు. విదేశీ పెట్టుబడులు పెట్టించారు. మహిళాహబ్స్ స్థాపించారు. స్టార్టప్స్ కల్చర్‌ను తీసుకొచ్చారు. పట్టణాభివృద్ధిని పరుగులు పెట్టించారు. ట్విట్టర్‌లో లక్షల మంది ఫాలోవర్స్‌ను సంపాదించుకున్నారు. ఇంకా అనేక అంశాల్లో స్ఫూర్తిగా నిలిచారు. మా జనరేషన్‌లో మీరు లీడర్‌గా ఉన్నందుకు గర్వంగా ఉన్నది. ధన్యవాదాలు. అమెరికాకు సులువైన బాటలుపర్చిన మీ పాలనకు కృతజ్ఞతలు. మాకు తెలంగాణ రాష్ట్రం సాధించి పెట్టినందుకు జేజేలు. తెలంగాణ బిడ్డలుగా, హైదరాబాదీలుగా మేము గర్వపడుతున్నాం' అని లేఖలో వినీల శ్లాఘించారు. ఆ లేఖను ఎక్స్‌లో పోస్టుచేసిన కేటీఆర్.. ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. ఆమె భవిష్యత్తు బాగుండాలని ఆశీర్వదించారు.

# ఢిల్లీలో మకాం.. పాలనకు రికాం

- స్వప్రయోజనాల కోసం హస్తినలో హస్తం నేతలు
- మేడిగడ్డపై తప్పుడు ప్రచారం:పొన్నాల లక్ష్మయ్య



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, చిత్రంలో గెల్లు శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసి పాలకులు ఢిల్లీలో మకాం వేశారని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. కాంగ్రెస్ నేతల ఢిల్లీ పర్యటనల్లో స్వప్రయోజనాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలు ఎక్కడా కనిపించటం లేదని ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఆరుగురు మంత్రులను డిసైడ్ చేయలేని దౌర్భాగ్యపు పార్టీ కాంగ్రెస్ అని, మంత్రివర్గంలో ఎప్పుడూ సామాజిక సమతూకాన్ని పాటించదని మండిపడ్డారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్న నీచ చరిత్ర కాంగ్రెస్‌ది అని, చేర్చుకున్న ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. పార్టీలో ఉన్న వారికి కాకుండా కొత్తవారికి ఎంపీ టికెట్లు ఇచ్చారని విమర్శించారు. మేడిగడ్డ బరాజ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు ప్రచారం చేసిందని, రూ.3 వేల కోట్ల మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే మొత్తం కొట్టుకపోయిందన్న స్థాయిలో ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారంటీల మీద మాట మర్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 37 కార్పొరేషన్లకు చైర్మన్లను ప్రకటించి ఇంతవరకు జీవో ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ఉన్నదని అన్నారు. అయోధ్య రామ మందిరంలో లీకేజీలు, బీహార్‌లో ఏడు బ్రిడ్జిలు కొట్టుకపోయాయని, ఎయిర్‌పోర్టులు కూలిపోతున్నాయని, వీటిపై మాట్లాడరేం అని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ధైర్యముంటే కేసీఆర్ అమలుచేసిన పథకాలను కొనసాగిస్తూ, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దింపేది నిరుద్యోగ యువతే: బాల్క సుమన్**

కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకవచ్చిన యువతే ఆ ప్రభుత్వాన్ని నిట్టనిలువునా కూల్చివేస్తుందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. నిరుద్యోగులను కాంగ్రెస్ నిండా ముంచిందని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదు కానీ రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, బల్మూరి వెంకట్‌కు ఉద్యోగం వచ్చిందని ఎద్దేవా చేశారు. గ్రూప్-1లో 1:100, గ్రూప్-2లో రెండు వేల పోస్టుల పెంచటం, గ్రూప్-3లో 3 వేల పోస్టులు పెంచటం, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలు చేస్తున్న నిరుద్యోగులను పోలీసులతో బెదిరిస్తున్నారని, ప్రభుత్వం వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. కొందరు మేధావులకు ఉద్యోగాలు రాగానే నిరుద్యోగుల సమస్యలు పట్టడం లేదని కోదండరాం, ఆకునూరి మురళి తదితరులను ఉద్దేశించి మండిపడ్డారు.

**గురు శిష్యులే..**

రేవంత్‌రెడ్డి, చంద్రబాబు గురుశిష్యులేనని.. చాలాసార్లు లోలోపల మాట్లాడుకున్నారని బాల్క సుమన్ విమర్శించారు. ఇప్పుడు బహిరంగంగా భేటీ అవుతున్నారని అన్నారు. నీటి వాటా, ఆస్తుల విషయంలో సీఎం రేవంత్ గట్టిగా నిలబడాలని సూచించారు. అయితే రేవంత్‌రెడ్డి గట్టిగా నిలబడతారన్న నమ్మకం తమకు లేదని తెలిపారు. గురుశిష్యుల భేటీ తెలంగాణ వనరుల దోపిడీ కోసమేమోనని, ఆ భేటీ తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రాకు తాకట్టు పెడుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ విషయాలపై మాట్లాతారన్నదని ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్వీ నాయకుడు తుంగ బాలు పాల్గొన్నారు.



# 'కాళేశ్వరం'పై జోక్యం చేసుకోబోం

- పలు వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ.. 2 వారాలకు వాయిదా
- రాష్ట్రాన్ని ప్రతివాదిగా చేర్చేందుకు పిటిషనర్‌కు అనుమతి

హైదరాబాద్, జూలై 4(నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు జరిగాయంటూ దాఖలైన వ్యాజ్యాల్లో ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. ప్రాజెక్టు నిర్మాణాల వ్యవహారంపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ విచారణతోపాటు సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కొనసాగుతున్నందున తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు, మేడిగడ్డ రిజర్వాయర్ కుంగుబాటుపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, న్యాయవాది రామ్మోహన్‌రెడ్డి, వ్యక్తిగత హోదాలో ప్రొఫెసర్ కోదండరాం, ముదిగంటి విశ్వనాథరెడ్డి, బక్క జడ్సన్ వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. రాష్ట్రం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేయకుండా కేంద్రాన్ని, సీబీఐని మాత్రమే చేయడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినకుండా ఉత్తర్వులు ఎలా ఇస్తామని పిటిషనర్‌ను ప్రశ్నించింది. న్యాయవాది రామ్మోహన్‌రెడ్డి జోక్యం చేసుకుని రాష్ట్రాన్ని ప్రతివాదిగా చేర్చేందుకు అనుమతివ్వాలని కోరగా ధర్మాసనం అనుమతిచ్చింది. బక్క జడ్సన్ వ్యాజ్యాన్ని ఉపసంహరించేందుకు అనుమతివ్వాలని ఆయన న్యాయవాది శరత్‌కుమార్ కోరగా ధర్మాసనం నిరాకరించింది. ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతున్నందున పిల్‌ను వాపస్ తీసుకుంటామని శరత్ కోరారు. ఘోష్ కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు జడ్సన్‌కు అనుమతిచ్చింది. వ్యాజ్యాలపై విచారణను 2 వారాలు వాయిదా వేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.



బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్. చిత్రంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

# కాంగ్రెస్‌ది ప్రతీకార పాలన

- నిబంధనల మేరకే బీఆర్ఎస్ ఆఫీసుకు భూకేటాయింపు
- కాంగ్రెస్ అక్రమ కేసులకు భయపడం: దాస్యం
- పార్టీ ఆఫీసు ఇటుకపెళ్ల కదిపితే.. గాంధీభవన్ కూలుతది: పెద్ది

హనుమకొండ, జూలై 4 : అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీకార పాలన సాగిస్తున్నదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ధ్వజమెత్తారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. హామీలను అమలు చేయాలని నిలదీస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, శ్రేణులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతున్నదని మండిపడ్డారు. రుణమాఫీ చేయలేక కాంగ్రెస్ నాయకులు తర్జనభర్జన పడుతున్నారని విమర్శించారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉన్నదని ఆరోపించారు. ప్రజా సమస్యలు చెప్పుకునేందుకు బాధితులు బీఆర్ఎస్ కార్యాలయాలకు వస్తుండడాన్ని చూసి ఓర్వలేకనే కార్యాలయాలను కూల్చివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. నగరంలోని సర్వేనంబర్ 1066లో ఎకరం భూమిని బీఆర్ఎస్ 4,84,000కు ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేసి, పార్టీ కార్యకలాపాలకే వాడుతున్నదని తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా ఆఫీసుకు కేటాయించిన భూమిని క్యాన్సిల్ చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బల్దియా డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, వారు పంపిన నోటీసుకు వివరణతో కూడిన సమాధానం బుధవారం డిప్యూటీ కమిషనర్‌కు అందజేశామని తెలిపారు. కేసులకు భయపడేది లేదని స్పష్టంచేశారు.

**పెండ్లిళ్లకు కాంగ్రెస్ ఆఫీసులు : పెద్ది**

కాంగ్రెస్ ప్రభుత్వం హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయాన్ని కూల్చేందుకు కుట్రలు చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్, సీపీఐ, సీపీఎం, టీడీపీ కార్యాలయాలకు భూమిని కేసీఆర్ రాకముందే కేటాయించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ కార్యాలయంలో ఇటుకపెళ్ల కదిపినా గాంధీభవన్‌ను కూల్చుతామని హెచ్చరించారు. పార్టీ కార్యాలయాలు కట్టుకోవడానికి జీవోను అప్పుడున్న ప్రభుత్వ నామినల్ రేట్ ప్రకారం ఇచ్చిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బోయినపల్లి మెయిన్ రోడ్‌లో 10 ఎకరాల భూమిని రాజీవ్‌గాంధీ నాలెడ్జ్ సెంటర్‌కు అదే జీవోను అనుసరించి కేటాయించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం కూడా మున్సిపాలిటీ భూమిలో కట్టించామని తెలిపారు. పార్టీ కార్యాలయాన్ని టచ్ చేస్తే, మీ కార్యాలయాలను కూడా టచ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా పార్టీ కార్యాలయాన్ని ఆంధ్రా బ్యాంకుకు, కరీంనగర్ కాంగ్రెస్ జిల్లా ఆఫీసును పెళ్లిళ్లకు కిరాయికి ఇస్తున్నారని, ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసులను కమర్షియల్‌గా వాడుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజక వర్గ కన్వీనర్ తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ పాల్గొన్నారు.

# ఇష్టముంటేనే పాలుపోయండి!

- బిల్లులు వచ్చేటప్పుడు వస్తయి
- పాడిరైతులకు విజయ డెయిరీ అధికారుల బెదిరింపులు
- 3 నెలలుగా బిల్లులు పెండింగ్
- గత ప్రభుత్వంలో 15 రోజులకోసారి బిల్లులు




హైదరాబాద్, జూలై 4(నమస్తే తెలంగాణ): 'బిల్లులు వచ్చేటప్పుడు వస్తయ్... మీ ఇష్టముంటే పాలు పోయండి.. లేదంటే బంద్ చేయండి' ఇదీ పాల బిల్లులు అడిగిన రైతులపై విజయ డెయిరీ అధికారుల బెదిరింపులు. రైతులు పాలు పోస్తేగానీ మనుగడ సాగించలేని డెయిరీ అధికారులు, అది వారి ప్రైవేటు కంపెనీ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి పదిహేను రోజులకోసారి రైతులకు పాల బిల్లులు చెల్లించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతున్నది. మొదటి మూడు నెలల బిల్లులను ఇటీవలె చెల్లించారు. ఇంకా మూడు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న రైతులు పాల బిల్లులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించగా విజయ డెయిరీ హైదరాబాద్ కేంద్రంలోని ఓ జనరల్ మేనేజర్ దురుసుగా ప్రవర్తించినట్టుగా తెలిసింది. 'మీ ఇష్టముంటే పాలు పోయండి లేకపోతే బంద్ చేయండి. అంతేగానీ బిల్లుల కోసం విసిగించొద్దు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్టుగా రైతులు వాపోయారు.

**120 కోట్లకుపైగా బకాయిలు**

పాడి రైతులకు విజయ డెయిరీ చెల్లించాల్సిన పాల బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇప్పటి వరకు సుమారు రూ. 120 కోట్ల బకాయిలు ఉన్నట్టుగా తెలిసింది. ప్రతి రోజు సుమారు లక్షన్నర మంది రైతుల నుంచి 2.5 లక్షల నుంచి 3 లక్షల లీటర్ల పాలను విజయ డెయిరీ సేకరిస్తున్నది. ప్రతి రోజు రైతులకు కనీసంగా రూ. 1.5కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. సకాలంలో బిల్లులు రాకపోవడంతో బర్రెలకు అవసరమైన దాన, మందులను కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**ఇంటి మీదికొస్తున్న బ్యాంకర్లు**

పాడి రైతులకు విజయ డెయిరీ ఆధ్వర్యంలోనే ముద్ర రుణాలతో పాటు ఇతర రుణాలను ఇప్పించి గేదెలను కొనుగోలు చేయించింది. రైతులు పాలు విక్రయించిన బిల్లుల నుంచి ప్రతి నెల బ్యాంకులకు చెల్లించాల్సిన మొత్తాన్ని విజయ డెయిరీ అధికారులే కట్ చేసి ఆ మొత్తాన్ని బ్యాంకులకు ఈఎంఐల రూపంలో చెల్లించేవారు. గత ప్రభుత్వంలో బిల్లులకు ఎలాంటి ఇబ్బంది కాలేదు. ఆర్నెళ్ల నుంచి పాల బిల్లులు ఆలస్యమవుతుండడంతో అధికారులు బ్యాంకులకు డబ్బులు చెల్లించలేకపోతున్నారు. ఈఎంఐలు చెల్లించాలని బ్యాంకర్లు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇంటిమీదికి వచ్చి రచ్చ చేస్తున్నట్టు రైతులు వాపోతున్నారు. ఆస్తులను జప్తు చేస్తామని బెదిరిస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఈఎంఐలు చెల్లించకపోవడంతో వారిని బ్యాంకులు డిఫాల్టర్లుగా ప్రకటిస్తున్నాయి. రైతుల సిబిల్ స్కోర్ కూడా పడిపోతున్నది. భవిష్యత్‌లో రైతులకు బ్యాంకుల్లో రుణం రావడం కష్టంగా మారుతున్నది.

**మంత్రి లేకపోవడంతో గాడి తప్పిన పాలన**

విజయ డెయిరీలో కొద్ది రోజులుగా పాలన పూర్తిగా గాడి తప్పిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ శాఖకు ఇప్పటి వరకు ప్రత్యేకంగా మంత్రి లేకపోవడం శాపంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాల సేకరణ, మార్కెటింగ్‌లో సరైన ప్రణాళిక లేకపోవడంతో ఆ ప్రభావం సంస్థపై పడుతుందని తెలిసింది. దీంతో సంస్థను ఆర్థిక సమస్యలు చుట్టుముట్టినట్టుగా తెలిసింది. కొద్ది రోజులుగా హైదరాబాద్ కేంద్రంతో పాటు జిల్లా స్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# సెలూన్ల కరెంట్‌కు సర్కార్ కటింగ్!

మొదటిపేజీ తరువాయి...

మళ్లీ పదేండ్లకంటే ముందురోజులను తలచుకొని ఆవేదన చెందుతున్నారు. అత్యంత వెనకబడిన నాయీబ్రాహ్మణ, రజక వృత్తిదారులకు ఆర్థికంగా చేయూతను అందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం సెలూన్లు, లాండ్రీ షాపులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాన్ని తీసుకొచ్చింది. 2021 ఏప్రిల్ 1 నుంచి దీనిని అమలు చేస్తున్నది. పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 71 వేల మంది రజకులు, 36 వేల మంది నాయీబ్రాహ్మణులు లబ్ధి పొందుతున్నారు. లబ్ధిదారులకు సొంత కమర్షియల్ విద్యుత్తు కనెక్షన్‌ను సైతం ప్రభుత్వం అందించింది. ప్రభుత్వం ప్రతి నెలా 250 యూనిట్ల విద్యుత్తు వినియోగానికి అయ్యే బిల్లును విద్యుత్తు బిల్లులో సబ్సిడీ కింద మినహాయించేంది. 250 యూనిట్లకు మించి వాడిన యూనిట్లకు మాత్రమే లబ్ధిదారులు బిల్లును చెల్లించుకునేవారు. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చాక అధికారులు గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. 250 యూనిట్ల చార్జీని విద్యుత్తు బిల్లులో సబ్సిడీగా మాత్రమే చూపుతున్నారు. మొత్తం బిల్లులో మాత్రం సబ్సిడీ నగదును మినహాయించకుండా, దానినీ కలిపే చూపుతున్నారు. దీంతో ఒక్కో యూనిట్‌పై వేలల్లో బిల్లులు పెండింగ్ ఉన్నట్టు చూపుతున్నది. ఇదే అదనుగా క్షేత్రస్థాయి విద్యుత్తు అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. బిల్లుల కోసం బెదిరింపులకు దిగుతున్నారని, లేదంటే విద్యుత్తు కనెక్షన్లు తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ సమస్యపై బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు చెప్పినా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన చెందుతున్నారు.

**కొత్త కనెక్షన్లు నిల్**

లాండ్రీ, సెలూన్ల లబ్ధిదారుడి పేరిట మాత్రమే విద్యుత్తు కనెక్షన్ ఉండాలనే నిబంధన ఉన్నది. ఈ నేపథ్యంలోనే అద్దె షాపులను నిర్వహిస్తున్న లాండ్రీ, సెలూన్ యజమానులు సదరు ఇంటి యాజమానితో చేసుకున్న ఒప్పంద, లీజు, రెంటల్ అగ్రిమెంట్ ధ్రువపత్రాలను సమర్పించి ఉచిత విద్యుత్తు యూనిట్‌కు కనెక్షన్‌ను తీసుకున్నారు. అంతేకాదు లబ్ధిదారుడు తన యూనిట్‌ను నిలుపుదల చేసినా, షాపును వేరే ప్రాంతానికి తరలించినా ఆ విషయాన్ని తప్పక బీసీ సంక్షేమశాఖకు, తెలంగాణ డిస్కమ్‌కు తెలిపి, కొత్తగా మారిన చోట ఆ మీటర్ కనెక్షన్‌ను పొందే వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం విద్యుత్తు అధికారులు మాత్రం షాపుల చిరునామాలను మార్చుకున్నా ఉచిత విద్యుత్తు సదుపాయాన్ని మాత్రం ఇవ్వడం లేదు. అధికారుల తీరుతో ఉచిత విద్యుత్తుకు దూరమవుతున్నామని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచిత విద్యుత్తు కనెక్షన్ కోసం గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించేవారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త కనెక్షన్లే ఇవ్వకపోగా, ఏకంగా దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటుచేసిన సైట్‌నే రద్దు చేసిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**రూ.100 కోట్లకు పైగా బిల్లుల పెండింగ్**

**రజకులు,** నాయీబ్రాహ్మణులకు ఇస్తున్న 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు వాషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌కు రూ.59.70 కోట్లను, నాయీబ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్‌కు రూ.50 కోట్లను బడ్జెట్‌లోనూ ప్రతిపాదించింది. గత జనవరిలో రూ.79.85 కోట్లను విడుదల చేస్తూ ఆదేశాలనూ జారీ చేసింది. కానీ ఇప్పటివరకు అందులో నుంచి ఒక్కరూపాయి కూడా ఫెడరేషన్లకు చెల్లించలేదు. కేవలం ఆదేశాలకే ప్రభుత్వం పరిమితమైంది. ఈ నేపథ్యంలోనే బిల్లుల చెల్లింపు కోసం విద్యుత్తు అధికారులు లబ్ధిదారులను వేధింపులకు గురిచేస్తున్నారు.

**అధికారుల వేధింపులను నిరోధించాలి**



ఉచిత విద్యుత్తు పథకం లబ్ధిదారులపై విద్యుత్తు అధికారుల వేధింపులను ప్రభుత్వం నిరోధించాలి. 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు పెండింగ్ బిల్లులను సత్వరమే విడుదల చేయాలి. షాపు నిర్వహణ ప్రదేశాన్ని మార్చుకున్న చోటుకు విద్యుత్తు మీటర్లను మార్చాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరహాలోనే కొత్త కనెక్షన్లను కూడా ఈ ప్రభుత్వం మంజూరు చేయాలి.

- కొండూరు సత్యనారాయణ, రజక సంఘాల సమితి ముఖ్య సలహాదారు